క్లుప్తంగా

భీమడోలు ఎంఈవో-2గా భాస్కర్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



భీమడోలు ఎంఈవో-2గా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్‌కుమార్

భీమడోలు: భీమడోలు ఎంఈవో 2గా ఏపీఎస్ఎస్ భాస్కర్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తూరు ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేస్తూ ఆయన పదోన్నతుల బదిలీల్లో భాగంగా భీమడోలు ఎంఈవో- 2గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన జిల్లా ఇన్‌చార్జి అకడమిక్ మోనటరింగ్ అధికారిగా ఏలూరు డీఈవో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. భీమడోలులో విధుల్లో చేరిన ఆయనను మంగళవారం పలువురు ఉపాధ్యాయులు, ఎస్ఎస్ఏ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

వ్యాయామ విద్యార్థులకు ఉచిత దంత వైద్యపరీక్షలు



విద్యార్థులకు దంతవైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దెందులూరు: విద్యార్థులకు ఉచితంగా స్టార్ డెంటల్ ఎక్స్‌పర్ట్స్ ఉచిత దంత వైద్యసేవలందించడం అభినందనీయమని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్ అన్నారు. మంగళవారం స్థానిక వ్యాయామ కళాశాలలో హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దంత వైద్యులు డాక్టర్ ఎస్. శ్రీహర్ష వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా 200 మందికి టూత్‌పేస్ట్‌లు, మౌత్‌వాష్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో హేలాపురి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ గణేష్ బాబు, సెక్రటరీ శ్రీరామ్మూర్తి, వైస్ ప్రిన్సిపల్ పీకేడీ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ రమేష్ తదితరులున్నారు.

అమర్‌నాథ్ హంతకులను కఠినంగా శిక్షించాలి



కూచింపూడిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

పెదవేగి : బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గం ఉప్పలవారిపాలెంలో అమర్‌నాథ్ గౌడ్‌ను దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ పెదవేగి మండలం గౌడ సంఘం నాయకులు కూచింపూడిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు కాగిత అక్షిత్ పూలే మాట్లాడుతూ అమర్‌నాథ్ గౌడ్‌ను అతి కిరాతకంగా చంపిన దోషులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తాతయ్య ,బెజవాడ రాంబాబు, పామర్తి రాంబాబు, బొల్లా రామకృష్ణ, పామర్తి జగదీష్, తాత మురళి పాల్గొన్నారు.

అమర్‌నాథ్ కుటుంబానికి ఆర్థిక సాయంపై హర్షం

దెందులూరు: దుండగుల చేతిలో హతమైన బాలుడు అమర్‌నాథ్ కుటుంబాన్ని ఆదుకోవడమే కాకుండా రూ. 10 లక్షలు ఆర్థిక సాయం అందజేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప మానవతా మూర్తి అని ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, మానవహక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ల మురళీకృష్ణ, రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తలారి రామకృష్ణ, కొవ్వలి ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి రంగారావు అన్నారు. బాపట్లలో దుండగుల చేతుల్లో హతమైన బాలుడి బాధిత కుటుంబానికి రాష్ట్ర మంత్రితో రూ. 10 లక్షల నగదు అందజేయడమే కాకుండా పక్కా ఇంటి నిర్మాణం, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం హామీ ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ఉంగుటూరు: నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరగోరు విద్యార్థులు తమ దరఖాస్తులను సమర్పించేందుకు జూన్ 24వ తేదీ ఆఖరు తేదీ అని ప్రిన్సిపాల్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరావు తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్స్ మెయిన్, మాథ్స్ మైనర్, బీఎస్సీ జీవశాస్త్రం మెయిన్స్, వృక్షశాస్త్రం మైనర్‌గా, బీఏ ఎకనామిక్స్ మేజర్, హిస్టరీ మైనర్, బీకాం జనరల్‌తో పాటు, కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. 23-24 విద్యా సంవత్సరంలో డిగ్రీ అడ్మిషన్లు పొందే విద్యార్థులకు కళాశాల సిబ్బంది సహకారంతో ఉచితంగా రెండు జతల యూనిఫారం, ఉచిత బస్‌పాస్ విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. అడ్మిషన్లు పొందగోరే విద్యార్థులు స్వయంగా కళాశాలను సందర్శించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



పిప్పరలో జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: విద్యతోనే సమాజం, కుటుంబం అభివృద్ధి చెందుతాయని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని, అందుకే పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రూ.వేలకోట్లు విద్యాభివృద్ధికి ఖర్చు చేస్తోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం గణపవరం మండలం పిప్పర ఉన్నత పాఠశాలలో మండలస్థాయిలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల పురస్కారాలు, నూతన విద్యాసంవత్సరంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంతవరకూ ఏ ప్రభుత్వమూ విద్యకు ఇంతటి ప్రాధాన్యత ఇవ్వలేదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. మన బడి, నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని, ప్రభుత్వ బడులలో చదివే పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యాబోధన, ఆంగ్లమాధ్యమం, సీబీఎస్ఈ సిలబస్, సెమిస్టర్ విధానం తదితర వినూత్న మార్పులతో వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్ ఆలోచన అన్నారు. ప్రతిభావంతులను ప్రోత్సహించడం ద్వారా మరికొందరిలో స్ఫూర్తి నింపేందుకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా ఆయన జగనన్న ఆణిముత్యాలు ప్రోత్సాహకాలు, విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈనెలాఖరు నాటికి అమ్మ ఒడి పథకం అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని, అర్హులందరికీ ఈ పథకంలో భాగంగా రూ.13 వేల ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాకర బేబి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మిబాబులు, ఎంపీపీ అర్ధవరం రాము, మండల ఉపాధ్యక్షురాలు నీతిపూడి వీరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వీరవల్లి దానమ్మ, ఎంపీడీవో జ్యోతిర్మయి, తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఎంఈవో-1 పుచ్చల శేషు, ఎంఈవో-2 గొర్రెల బాలయ్య, పార్టీ నాయకులు కాకర శ్యాంసన్, వడ్డి ఉమ, పంపన శ్రీను, శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు ఆదిమూలం శ్రీనివాస్, కోట నాగేశ్వరరావు, మల్లంపల్లి సురేష్ పాల్గొన్నారు.

22న కూచింపూడిలో నియోజవర్గస్థాయిలో..

పెదపాడు: ఈనెల 22న నియోజకవర్గ స్థాయి ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెదపాడు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీ సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. పెదపాడు జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆణిముత్యాలుగా నిలిచారని చెప్పారు. విద్యార్థి సుబ్రహ్మణ్యం, ఎంపీసీ (965), బీ చిరంజీవి, సీఈసీ (640), పీ గుణరాధిక హెచ్ఈసీ (602) సాధించి నియోజకవర్గంలో మొదటి స్థానంలో నిలిచారని చెప్పారు. ఈనెల 22న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేతుల మీదుగా వారికి రూ.15వేలు నగదు, పతకాలు బహుమతిగా అందించనున్నారని చెప్పారు.

ప్రతిభావంతులకు అవార్డుల ప్రదానం



పోతునూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవార్డులు అందజేసిన ప్రజాప్రతినిధులు

దెందులూరు: జగనన్న ఆణిముత్యాలు ఇతర విద్యార్థులకు ఆదర్శప్రాయులవుతారని దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్ అన్నారు. మంగళవారం పోతునూరు ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్ఎం సూర్యలక్ష్మి అధ్యక్షతన జగనన్న ఆణిముత్యాల విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో షీల్డ్స్, సర్టిఫికెట్లు, నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోదుల స్వరూప్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు బీశెట్టి నూకరాజు, బుద్దా అర్జున, ఉపాధ్యాయులున్నారు.

ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



పెదవేగిలో ఓటర్ల జాబితాపై బీఎల్ఓలతో మాట్లాడుతున్న సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్

పెదవేగి : ఓటర్ల నమోదులో సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్ సూచించారు. మంగళవారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం కొత్తగా ఓటరు నమోదు చేయించుకునే వారి వివరాలను జాగ్రత్తగా పరిశీలించి నమోదు ప్రక్రియ ఉండాలని, వందేళ్లు పైబడిన ఓటరును ఫామ్ 8లో నమోదు చేయాలని ఆయన అన్నారు. ఒకే ఇంటిలో పదికి మించి ఓటర్లు ఉన్నట్లయితే వారిని ఫామ్ ఏలో నమోదు చేయడంతో పాటు చనిపోయిన ఓటర్ల తొలగింపు ప్రక్రియ, కొత్త ఓటర్ నమోదు ప్రక్రియ సజావుగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని బీఎల్ఓలకు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ శేఖర్ బాబు, బీఎల్‌వోలు ప్రభాకర్, లక్ష్మీపతి, కార్తీక్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉత్సాహంగా యోగా డే



ఉంగుటూరులో విద్యార్థుల అవగాహన ర్యాలీ



పెదవేగి : యోగా అక్షర ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

దెందులూరు: యోగాతో మానసిక, శారీరక ఆరోగ్య పరిరక్షణ దృఢత్వం, ప్రశాంతత, క్రమశిక్షణ లభిస్తుందని పాఠశాల హెచ్ఎం శర్మ, ఫిజికల్ డైరెక్టర్ జక్కుల సురేష్ అన్నారు. మంగళవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో యోగా డే నిర్వహించారు. హెచ్ఎం, ఫిజికల్ డైరెక్టర్, పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు యోగా డే ఆకారంలో ప్రదర్శన నిర్వహించి అబ్బురపరిచారు. విద్యార్థులను హెచ్ఎం శర్మ అభినందించారు.

యోగాపై చైతన్య ర్యాలీ



పెదవేగి : గార్లమడుగు ఓరియంటల్ పాఠశాలలో యోగాసనంలో చిన్నారులు

ఉంగుటూరు: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉంగుటూరు-1 పాఠశాల విద్యార్థులు చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి డాక్టర్ లక్ష్మీసౌజన్య ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల వద్ద నుంచి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో యోగా ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు మందా జయలక్ష్మి, కాటి రాజేష్, ప్రధానోపాధ్యాయులు పెద్దిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

పెదవేగి : అంతర్జాతీయంగా యోగా దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసారు. కొప్పాక, విజయరాయి, పెదవేగి, గార్లమడుగు ఓరియంటల్ హైస్కూల్, దుగ్గిరాల సెయింట్ జోసఫ్ దంత కళాశాల తదితర పాఠశాలల్లో యోగా దినోత్సవం నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ యోగాసనాలు వేసి వాటి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయులు మాట్లాడుతూ అన్ని వయస్సుల వారు యోగాసనాలు తప్పక వేయాలని దీంతో, దీర్ఘకాలిక రోగాలకు, మంచి ఉపశమనమే కాక, శారీరక, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా అనే అక్షర ఆకృతిలో విద్యార్థులు కూర్చుకున్నారు.

ప్రధానోపాధ్యాయుడిని బదిలీ చేయాలని స్పందనలో ఫిర్యాదు

భీమడోలు: గతంలో పలు ఆరోపణలతో బదిలీ అయిన పోలసానిపల్లి-1 పాఠశాల ప్రధానోపాధ్యాయుడ్ని ఇటీవల అదే పాఠశాలకు ఉన్నతాధికారులు పంపడంతో బాలబాలికల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో దీనిపై వారు ఫిర్యాదు చేసారు. ఆ ప్రతులను మంగళవారం విలేకరులకు అందజేసారు. గతంలో పోలసానిపల్లి-1 పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వహించిన తరుణంలో ఆయనపై పలు ఆరోపణలు రావడంతో అధికారులు వేరే పాఠశాలకు బదిలీ చేసారు. ఇటీవల బదిలీల్లో అతన్ని మరలా పోలసానిపల్లి-1 పాఠశాలకు పంపించారు. అతన్ని వేరే పాఠశాలకు పంపాలని, లేని పక్షంలో కలెక్టర్ వద్ద తమ గోడును విన్నవించుకుంటామని బాలబాలికల తల్లిదండ్రులు కె.వీరవెంకటదుర్గ, కె.సరస్వతి, పి.దుర్గ, ఎం.కృష్ణవేణి, ఎం.శివపార్వతీ, ఎం.దుర్గా, ఎం.భవానీ, కె.దుర్గాభవాని, కె.రాజేశ్వరి, ఎం.పద్మ, మామిడి రాటాలు అన్నారు.

నేడు లక్ష్మీపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

పెదవేగి : పెదవేగి మండలం లక్ష్మీపురంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని ఆయన చెప్పారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని సతీష్ కోరారు.

సమగ్ర రీసర్వే పనులు వేగవంతం చేయాలి



తోటగూడెంలో గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో కిశోర్

పెదపాడు: జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా నిర్వహించే సమగ్ర రీసర్వే పనులు వేగవంతం చేయాలని ఏలూరు ఆర్డీవో పెంచల కిశోర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని తాళ్లగూడెంలో నిర్వహిస్తున్న రీసర్వే పనులను మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవగాహన కల్పించి వీలైనంత త్వరలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గతంలో రీసర్వే పూర్తి చేసిన తోటగూడెం గ్రామ సచివాలయంను ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్లను గ్రామ సచివాలయంలోనే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. నెట్ సౌకర్యంతో పాటు ఇతర సౌకర్యాలు సక్రమంగా లేనందున నిర్వహించడం లేదని సిబ్బంది సమాధానం ఇవ్వడంతో సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, డీటీ నాగరాజు, మండల సర్వేయర్ కోదండరామ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం వెంకటేశ్వరరావు, వీఆర్వో మురళీ పాల్గొన్నారు.

సీతారామస్వామి వార్ల శాంతి కల్యాణోత్సవం

భీమడోలు: గుండుగొలనులోని దేవాదాయ ధర్మశాఖ పరిధిలోని ప్రసిద్ధి చెందిన పురాతన దేవాలయం సీతారామస్వామి ఆలయంలో మంగళవారం స్వామి, అమ్మవార్ల జన్మన క్షత్రం పునర్వసును పురస్కరించుకుని శాంతి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగరాజ్‌కుమార్ పర్యవేక్షణలో అర్చకులు సాయి సుధీరాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, శాంతి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు.

900 మట్టి నమూనాల సేకరణే లక్ష్యం

పెదపాడు: వ్యవసాయ శాఖ ద్వారా 2023-24 సంవత్సరానికి 900 నమూనా పరీక్షలు లక్ష్యంగా నిర్దేశించినట్లు పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. మంగళవారం పెదపాడు మండలంలోని కొక్కిరపాడులో నమూనాను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో ప్రతి 2.5 ఎకరాలకు ఒక నమూనా, అప్‌ల్యాండ్‌లో ప్రతి 5 ఎకరాలకు ఒక నమూనా సేకరిస్తున్నామని జూన్ నెలకు 550 నమూనాలు సేకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డియ్య, రైతులు గంగాధరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఏపీ లాసెట్‌లో 4వ ర్యాంకు



సత్యనారాయణను శాలువా కప్పి సత్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఏపీ లాసెట్‌లో ఉంగుటూరుకు చెందిన అంబటి సత్యనారాయణకు రాష్ట్రస్థాయి 4వ ర్యాంకు రావడంతో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శరణాల మాలతిరాణి మంగళవారం ఆయనను శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా మాలతీరాణి మాట్లాడుతూ నూజివీడు ఐఐఐటీలో మెట్రాలజీ విభాగంలో బీటెక్ పూర్తిచేసిన సత్యనారాయణ తల్లిదండ్రులకు చేదోడు, వాదోడుగా ఉంటూ లాసెట్‌లో సన్నద్ధమై 4వ ర్యాంకు సాధించడం ఉంగుటూరుకే గర్వకారణం అన్నారు. తల్లిదండ్రులు రమణ, సూర్యనారాయణను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నగరపాటి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు కాకిలేటి వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి నూకల రోహిత్‌నాయుడు, సురేష్ పాల్గొన్నారు.

ఆషాఢ మాస పూజలు

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామదేవత చల్లాలమ్మ ఆలయంలో ఆషాఢమాస ప్రత్యేక పూజలు ప్రారంభించారు. మంగళవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వెంపరాల జోగి శాస్త్రి పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని, ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

పెదపాడు: గృహ నిర్మాణ లబ్ధిదారులు ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు తెలిపారు. మంగళవారం సత్యవోలులో గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ ఏఈ , లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన అజెండా

- ఇంటింటికీ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం
- కొండ్రెడ్డినగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



కొండ్రెడ్డినగర్‌లో లబ్ధిదారులకు లబ్ధి పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమమే ప్రధాన అజెండాగా ప్రజలందరికీ సుపరిపాలన అందిస్తూ వారి గుండెల్లో చిరగని ముద్ర వేసుకున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. అంబర్‌పేట పంచాయతీ శివారు కొండ్రెడ్డినగర్‌లో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని లబ్ధిదారులకు వివరిస్తూ వారికి బుక్‌లెట్‌ను అందించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అమలు తీరుపై వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తూ వాసుబాబును దీవించారు. తొలుత మహిళలు హారతులు పట్టారు. వైసీపీ శ్రేణులు బాణసంచా కాల్చుతూ వాసన్నకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందించాలన్న ఏకైక లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేనటువంటి వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. గడపగడపకూ సంక్షేమం చేరాలన్నదే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం నాలుగేళ్లగా అలుపెరగని రీతిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రతి పథకాన్ని అందించే విషయంలో పారదర్శకత, జవాబుదారీతనంలో ఈ వ్యవస్థలు పని చేస్తున్నాయని, దీనితో దేశంలోనే ఏపీ అగ్రగామిగా నిలిచిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ధృఢ సంకల్పంతో రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజాదరణ పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏపూరి భానుదీపిక రాంబాబు, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, మండల సాగు సలహా సంఘం అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, ఎంపీటీసీ ఆజామ్, దాసరి విజయభాను, సొసైటీ డైరెక్టర్ నవలం నాని, పార్టీ అధ్యక్షుడు కర్రి శ్రీను, రామిశెట్టి శ్రీను, ఉపసర్పంచ్ కొడుదుల సురేష్, సర్పంచులు గుడివాడ నాగగౌతమి సీతారామాంజనేయులు, మానుకొండ నాగేశ్వరరావు, నాయకులు అన్నేపురెడ్డి నాగరాజు, కర్రి జగన్నాథం , దోనేపల్లి కృష్ణ, వార్డు సభ్యులు కట్టా దుర్గారావు, పరసా పెద్దిరాజు, మద్దిపాటి సత్యశ్రీనివాస్, గుణ్ణంపల్లి శ్రీను పాల్గొన్నారు.